
# రిసెప్షన్ కు హాజరైన గడ్డం ఫ్యామిలీ



హనుమకొండ ఇందిరా నగర్ కు చెందిన గుజ్జ ఇందిర–వెంకటేశం దంపతుల ప్రథమ పుత్రుడు వెంకట వసంత్–వైష్ణవి ల రిసెప్షన్ సోమవారం హనుమకొండలోని అసంతా భవన్ లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి కుటుంబ సమేతంగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు.
–వరంగల్ వాయిస్, సుబేదారి


వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 268
పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం
జూలై 28, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


వివరాలు 7లో..




## సరైనోడు

# కర్నాటి వరుణ్ రెడ్డి

- టీజీఎన్ పీడీసీఎల్ సీఎండీగా ప్రత్యేక గుర్తింపు
- జీరో ప్రమాదాలే లక్ష్యంగా అడుగులు
- అంతరాయాలు లేని విద్యుత్ సరఫరాకు కృషి
- వినియోగదారులు, ఉద్యోగుల శ్రేయస్సుకు మొదటి ప్రాధాన్యం
- ఆధునిక సాంకేతికత పద్ధతుల అమలు

సవాళ్లను స్వీకరించే వ్యక్తిత్వం, సాంప్రదాయాలను గౌరవించే మనస్తత్వం, దాపరికాల్లేని ముక్కుసూటి తత్వం.. ఇదే టీజీ ఎన్ పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కర్నాటి వరుణ్ రెడ్డికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెడుతోంది. ఆయన నిరంతర అధ్యయన శీలి. ఏ హోదాలో పని చేసినా పనికి మొదటి ప్రాధాన్యం ఇస్తారు. ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీగా 2023 డిసెంబర్ 15న బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు. యువ ఐఏఎస్ అధికారిగా విద్యుత్ సంస్థలో అనేక సంస్కరణలు తీసుకు వచ్చారు. తరచూ వీడియో కాన్ఫరెన్స్ లు, సమీక్షలు, తనిఖీలు నిర్వహిస్తూ అందరినీ కార్యోన్ముకులను చేస్తున్నారు. విధుల పరంగా ఆయనది బిజీ లైఫ్. అయినా దేని టైం దానికే. ఆఫీసు పనులను ఇంటికి తీసుకురారు. ఇంటి వ్యవహారాలను ఆఫీసులోకి తీసుకెళ్లరు. ఈ క్రమశిక్షణను బాల్యం నుంచే వరుణ్ రెడ్డి అలవాటు చేసుకున్నారు. ఈ పరిణామాల వెనుక క్రమశిక్షణతో సాగిన ఆయన జీవితం ఉంది. కాబట్టే సంస్థలో పనిచేస్తున్న సుమారు పదివేల మంది ఉద్యోగులు, సిబ్బందిని నిరంతరం పరుగులు పెట్టిస్తూ.. నిరంతరాయంగా వెలుగులు ప్రసరింపజేస్తున్నారు.

- వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి






2లో..

# సృష్టితో.. కలవరం




- వరంగల్‌లో టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ల ఉలికిపాటు
- పిల్లలు లేని దంపతులే టార్గెట్
- అనుమతులకు తిలోదకాలు
- అందినకాడికి దోచుకుంటున్న వైనం



## ముహూర్తం ఫిక్స్



8లో..

- 30న బీజేపీలోకి యువ నాయకుడు ధరావత్ నరేష్ నాయక్
- రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలో చేరిక
- దోర్నకల్ బీజేపీకి మరింత బలం



8లో..

## కార్పొరేట్ కబంధహస్తాల్లో చదువులు

- నటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణ మూర్తి
- విద్యార్థి నాయకులతో కలిసి సినిమా వాల్ పోస్టర్ల విడుదల

వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, జూలై 28, 2025

# సృష్టితో కలవరం..

- వరంగల్‌లో టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ల ఉలికిపాటు
- పిల్లలు లేని దంపతులే టార్గెట్
- అనుమతులకు తిలోదకాలు
- అందినకాడికి దోచుకుంటున్న వైనం

సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌లో వెలుగుచూసిన ఘటన వరంగల్ నగరంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. పలువరు టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ల నిర్వాహకులను ఉలిక్కిపడేలా చేసింది. పిల్లలు లేని దంపతుల నిస్సహాయతను ఆసరాగా చేసుకుని అడ్డగోలుగా వ్యాపారం చేస్తున్న ఈ సెంటర్లు ఇప్పటికే వరంగల్‌లో ఇబ్బడిమబ్బడిగా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఏం జరుగుతుందో మూడో కంటికి కూడా తెలియకుండానే వ్యవహారాలు నడుస్తున్నాయన్నది అందరికీ తెలిసిన సత్యం. ఐవీఎఫ్ (In Vitro Fertilization) పేరుతో నమ్మించి, అమాయకులైన దంపతుల నుంచి అందిన కాడికి డబ్బులు దోచుకోవడమే కాకుండా, వారి నిస్సహాయతను ఆసరాగా చేసుకుని సరోగసీ వైపు మళ్లిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అంతేకాదు, వేరొకరి వీర్యంతో పిల్లలు పుట్టేలా చేసి, పెద్ద మొత్తంలో దోచుకుంటున్న మోసపూరిత టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లు చాలానే ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. పిల్లలు లేని దంపతులను లక్ష్యంగా చేసుకుని టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్లు వైద్యవ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాయి. ఏజెంట్లను నియమించుకుని, సరోగసి కోసం పేద మహిళలకు ఎర వేస్తున్నారు. డబ్బు ఆశ చూపి ఐవీఎఫ్ విధానం ద్వారా గర్భధారణ చేయించి, పసికందులను విక్రయించిన కేసులను ఎన్నో మనం చేశాం. వరంగల్ మహానగరంలో టెస్ట్ ట్యూట్ సెంటర్ల పేరుతో పుట్టగొడుగుల్లా ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వైద్య శిబిరాలు నిర్వహించి, నిరుపేద మహిళలను గుర్తించి.. వారికి డబ్బు ఆశ చూపి.. ఈ వ్యవహారం నడుపుతున్నట్లు భోగట్టా. వీటిపై ఎన్నో ఫిర్యాదులు ఉన్నా బాధితులు బయటకు రాకపోవండతో వీరి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.

## సృష్టిలో మోసం..

కొంతకాలం క్రితం, సంతానం లేని ఓ దంపతులు సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌ను సంప్రదించారు. డాక్టర్ నమ్రత వారికి పరీక్షలు నిర్వహించి, ఐవీఎఫ్ సాధ్యం కాదని, సరోగసీ ద్వారా సంతానం పొందవచ్చని సూచించారు. సరోగసీకి రూ.30 లక్షలు ఖర్చవుతుందని, విశాఖపట్నానికి చెందిన ఓ మహిళ సరోగసీకి అంగీకరించిందని నమ్మబలికారు. దంపతుల నుంచి అండం, వీర్యం సేకరించి సరోగసీ చేస్తున్నట్లు వారికి భ్రమ కల్పించారు. అయితే, విశాఖలోని ఓ గర్భిణిని సరోగసీ మదర్‌గా చూపించి, కొన్నాళ్ల తర్వాత ఆసుపత్రిలో ఒక శిశువును దంపతులకు అప్పగించారు. అనుమానం వచ్చిన దంపతులు డీఎన్ఏ పరీక్ష చేయించగా, ఆ శిశువు తమకు చెందినది కాదని తేలింది. దీంతో పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. ఈ కేసులో డాక్టర్ నమ్రతతో పాటు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.




## వరంగల్‌లో టెస్ట్ ట్యూబ్ సెంటర్ల ఆగడాలు..

వరంగల్ నగరంలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న టెస్ట్ ట్యూబ్, ఐవీఎఫ్, సరోగసీ సెంటర్లకు సరైన అనుమతులేవీ లేవని ప్రజా సంఘాల నుంచి తీవ్ర ఆరోపణలున్నాయి. వరంగల్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని, ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని పిల్లలు లేని అమాయక దంపతుల నిస్సహాయతను ఈ సెంటర్లు సొమ్ము చేసుకుంటున్నాయని వారు మండిపడుతున్నారు. గతంలో కూడా వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో ఇలాంటి మోసాలు చాలానే బయటపడ్డాయి. అయినప్పటికీ, పిల్లలు లేని దంపతుల సంఖ్య రోజు రోజుకూ పెరగడంతో ఈ కేంద్రాలకు కాసుల వర్షం కురుస్తోంది. పిల్లల కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రుల పుణ్యాన వారి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుస్తున్నా, అధికారులు మాత్రం వీటిపై కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలున్నాయి. హై–ప్రొఫైల్ వ్యక్తులే ఇలాంటి సెంటర్లను నడుపుతుండటంతో, అందులో ఏం జరిగినా అది బయటి ప్రపంచానికి తెలియకుండా మేనేజ్ చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం. ఈ వ్యవహారంపై వైద్య శాఖ, పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారన్నది మిలీనియన్ ప్రశ్నగా మారింది.

## చట్టబద్ధత ఉందా...

ప్రపంచవ్యాప్తంగా సరోగసీ చట్టం మారుతూ ఉంటుంది. చాలా దేశాల్లో సరోగసీకి ప్రత్యేక చట్టాలు లేవు. భారత్ లో కొన్ని నిబంధనలతో కూడిన సరోసికి మాత్రమే అనుమలున్నాయి. కొన్ని దేశాలు సరోగసీని పూర్తిగా నిషేధిస్తే, మరికొన్ని వాణిజ్య సరోగసీని నిషేధిస్తాయి. కానీ పరోపకార సరోగసీని అనుమతిస్తాయి (ఇందులో సరోగసీకి ఆర్థికంగా పరిహారం లభించదు). కొన్ని దేశాలు పరిమితులతో వాణిజ్య సరోగసీని అనుమతిస్తున్నారు. కొన్ని అధికార పరిధులలో దత్తతకు వర్తించే నియమాలు వర్తిస్తాయి. మరికొన్ని ఈ పద్ధతిని నియంత్రించవు. కెనడా, యూరప్‌లోని చాలా ప్రాంతాలలో వాణిజ్య సరోగసీ నిషేధించబడింది. యూఎస్, ఉక్రెయిన్, రష్యా, జార్జియా ప్రపంచంలోనే అతి తక్కువ నియంత్రణ చట్టాలను కలిగి ఉన్నాయి. విదేశీయులతో సహా వాణిజ్య సరోగసీని అనుమతిస్తాయి. ఇరాన్‌లో సరోగసీ చట్టబద్ధమైనది. అనేక ఆసియా దేశాలు గతంలో తక్కువ నియంత్రణ చట్టాలను కలిగి ఉండేవి. కానీ ఆ తర్వాత ఈ పద్ధతిని పరిమితం చేశారు. 2013లో థాయిలాండ్ వాణిజ్య సరోగసీని నిషేధించింది. థాయ్ జంటలకు మాత్రమే పరోపకార సరోగసీని పరిమితం చేసింది. 2016లో కంబోడియా వాణిజ్య సరోగసీని కూడా నిషేధించింది. నేపాల్, మెక్సికో, భారతదేశం కూడా ఇటీవల విదేశీ వాణిజ్య సరోగసీని నిషేధించాయి.

## తనిఖీలు చేయాలి..

వరంగల్ నగరంలోని టెస్ట్ ట్యూబ్ సెంటర్లలో వైద్య, పోలీసు శాఖ అధికారులు తనిఖీలు చేపడితే అనేక సంచలన విషయాలు బయటపడతాయని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ సెంటర్లలోని డేటా, ఐవీఎఫ్, సరోగసీ చికిత్స చేయించుకున్న దంపతుల వివరాలు పరిశీలిస్తే అక్కడ జరుగుతున్న దందా మొత్తం వెలుగులోకి వస్తుందని వారు చెబుతున్నారు. ముఖ్యంగా, అనధికారికంగా ఎంత మంది జంటలకు ఇలాంటి చికిత్స చేశారు? ఇప్పటి వరకు సరోగసీ ద్వారా పిల్లలు కలిగిన దంపతులకు పుట్టిన పిల్లలు నిజంగా వారికే చెందినవారేనా? అనే విషయాలను నిర్ధారించుకోవడానికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని వారు సూచిస్తున్నారు. ఇలాంటి సమగ్ర తనిఖీలు చేపడితే టెస్ట్ ట్యూబ్ సెంటర్ల ఆగడాలు, అక్రమాలు బయటపడతాయని ప్రజా సంఘాలు బలంగా నమ్ముతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, వైద్య శాఖ అధికారులు చిత్తశుద్ధితో స్పందించి, ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసి సమగ్ర దర్యాప్తు చేయాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తుంది.



## సరోగసీ అంటే..

పిల్లలు కావాలనుకునే తల్లిదండ్రుల కోసం వారికి సంబంధం లేని మరో మహిళ తన గర్భంలో బిడ్డను మోసి జన్మనిచ్చే ప్రక్రియ. ఇందులో ప్రధానంగా రెండు పద్ధతులున్నాయి. సాంప్రదాయ సరోగసీ (Traditional Surrogacy)పద్ధతిలో బిడ్డను మోసే మహిళ (సరోగసీ మదర్) తన సొంత అండాన్ని ఉపయోగిస్తుంది. దీనివల్ల బిడ్డకు సరోగసీ మదర్‌తో జన్యుపరమైన సంబంధం ఉంటుంది. గెస్టేషనల్ సరోగసీ (Gestational Surrogacy)విధానంలో బిడ్డను మోసే మహిళ తన సొంత అండాన్ని ఉపయోగించదు. బదులుగా, పిల్లలు కావాలనుకునే తల్లిదండ్రుల అండం, వీర్యం (లేదా దాతల నుంచి సేకరించినవి) ఉపయోగించి రూపొందించిన పిండాన్ని సరోగసీ మదర్ గర్భంలో ప్రవేశపెడతారు. ఈ పద్ధతిలో సరోగసీ మదర్‌కు బిడ్డతో ఎలాంటి జన్యు సంబంధం ఉండదు.



## ఐవీఎఫ్ అంటే..

ఇన్–విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) అనేది ఒక రకమైన సహాయక పునరుత్పత్తి సాంకేతికత. గర్భం ధరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జంటలకు లేదా వ్యక్తులకు ఐవీఎఫ్ ద్వారా చికిత్స అందించి వారిని బిడ్డకు జన్మనిచ్చేలా చేసే ప్రక్రియ. చికిత్సలో అనేక దశలు ఉంటాయి. ప్రధానంగా, స్త్రీ శరీరం వెలుపల, ప్రయోగశాలలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ గుడ్లను స్పెర్మ్‌తో కలిపి ఫలదీకరణం చేస్తారు. ఫలదీకరణం చెందిన తర్వాత ఏర్పడిన పిండాలలో ఒకటి (కొన్నిసార్లు అంతకంటే ఎక్కువ) తిరిగి స్త్రీ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. ఈ ప్రక్రియ ద్వారా, దంపతులు బిడ్డను కనే అవకాశాన్ని పొందుతారు.



## ధనార్జనే ధ్యేయంగా...

**-నిమ్మల శ్రీనివాస్, సామాజికవేత్త**

పిల్లలు లేని వారి బలహీనతలను ఆసరాగా చేసుకుని కొందరు వైద్యులు మానవతా విలువలను మరిచి, ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. టెస్ట్ ట్యూబ్ ద్వారా సంతానం కల్పిస్తామంటూ అమాయకులను మోసం చేస్తున్నారు. ముఖ్యంగా, ఈ మోసాలకు ఎక్కువగా గురవుతున్నది సమాజంలో ధనవంతులే కావడం గమనార్హం. ఈ మోసగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఈ టెస్ట్ ట్యూబ్ సెంటర్లపై నిఘా ఏర్పాటు చేసి, వారి అక్రమాలను బయటపెట్టాలి. ప్రజలు వీరి చేతిలో మోసపోకుండా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అక్రమంగా టెస్ట్ ట్యూబ్ సెంటర్లను నిర్వహించే వారిపై చట్టపరంగా గట్టి చర్యలు తీసుకుని, తగిన శిక్షలు పడేలా చేస్తే మిగిలిన వారికి అది గుణపాఠం అవుతుంది. ఆకర్షణీయమైన ప్రకటనలకు ప్రజలు ఆకర్షితులు కాకుండా, వీటి పట్ల ప్రజలలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత స్వచ్ఛంద సంస్థలపై కూడా ఉందని నా అభిప్రాయం. వెలుగులోకి వచ్చిన విషయాలు కేవలం కొన్ని మాత్రమే. ఈ మోసాల గురించి బయటపెట్టడానికి, తాము మోసపోయామని చెప్పడానికి సమాజానికి భయపడి, తమలో తామే కుమిలిపోతున్నవారు ఎంతోమంది ఉన్నారు.



## ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి..

**- సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు**

సంతానం కోసం టెస్ట్ ట్యూబ్ సెంటర్లకు దంపతులు వెళితే వారి బలహీనతను ఆసరాగా చేసుకొని అందిన కాడికి దండుకుంటూ వైద్య వృత్తికి కళంకం తెస్తున్నారు. దీనిపై పర్యవేక్షణ చేయాల్సిన రాష్ట్ర, జిల్లా వైద్య శాఖ అధికారులు తమ స్వప్రయోజనం కోసం ఈ అక్రమ దందాలో భాగస్వాములు అయినందున వీరిపై చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా సంతానం కోసం ఉబలాటపడే దంపతులు పెద్ద మొత్తంలో నష్టపోయనా వారి కోరిక మాత్రం నెరవేరడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ల ఏర్పాటుకు తగిన నిబంధనలు ఏర్పాటు చేసి కఠినంగా అమలు చేయాలి. ఈ అక్రమ దందాపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాలి.

# 'బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదు'

◆ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్ పార్టీ గత పదేళ్ల పాలన అంతా కమిషన్ల పాలన అని, ఆ పార్టీ అంటేనే దోచుకుని దాచుకునే పార్టీ అని కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్ల ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కేటీఆర్ ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు చేశారని ఆయన ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ పాలనలో ఒక్క పేదవాడికి కూడా ఇల్లు గానీ, రేషన్ కార్డులు గానీ ఇవ్వలేదని, అలాంటి వారు ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని కొయ్యడ శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల స్వల్ప కాలంలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదేనని ఆయన తెలిపారు. ప్రతి పేదవాడి కడుపు నింపేందుకు సన్న బియ్యం పంపిణీ, ఉచిత విద్యుత్తు, గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీ ఇచ్చి పేదల కళ్లల్లో ఆనందం నింపిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కొయ్యడ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఓట్ల కోసం మాత్రమే రాజకీయం చేసేది బీఆర్ఎస్ పార్టీ అని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలు మెచ్చిన ప్రజా పాలన నడుస్తోందని కొయ్యడ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కుంకుమేశ్వర టెంపుల్ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, సమన్వయ కమిటీ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ అనిత రామకృష్ణ, చిన్నల గోనాథ్, ఎండి రంజాన్ అలీ, పంచగిరి జయమ్మ, బుర్ర రాజమౌళి, చందుపట్ల రాఘవరెడ్డి, మెరుగు శ్రీశైలం, పసుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శుభకార్యానికి వెళ్లి వస్తూ బావిలో పడిన ఆటో

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్న ఓ కుటుంబానికి మార్గమధ్యంలో తీవ్ర విషాదం ఎదురైంది. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనుకున్న ఆశలు ఆవిరయ్యాయి. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవేడు గ్రామంలో అర్ధరాత్రి ఆటో రోడ్డు పక్కన ఉన్న పాడుబడ్డ బావిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన శ్రీరామ్ నర్సయ్య (68) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య భారతమ్మ (60) పరిస్థితి విషమంగా ఉంది, కొడుకు మార్కండేయ (39)కి స్వల్ప గాయాలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగిన శుభకార్యానికి హాజరైన ఈ కుటుంబం, తమ సొంత గ్రామం మునిగలవేడుకు రాత్రి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది, పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

# కేయూ పరిశోధకురాలు కృష్ణవేణికి ఆర్థిక సహాయం


మలేషియా పారా త్రైక్వాండో పోటీలకు ఎంపిక



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పరిశోధకురాలు మాచర్ల కృష్ణవేణికి విశ్వవిద్యాలయం ఆర్థిక సహాయం అందించింది. ఈ ఏడాది ఆగస్టు నెలలో మలేషియాలో జరగనున్న 10వ ఆసియా పారా త్రైక్వాండో పోటీల్లో ఆమె పాల్గొననున్నారు. ఈ విషయాన్ని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. విశ్వవిద్యాలయ దివ్యాంగుల సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించారు. గత నెలలో కృష్ణవేణి విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక సహాయం కోరారని తెలిపారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు, విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై.వెంకయ్య పర్యవేక్షణలో స్పోర్ట్స్ బోర్డు ఖాతా నుంచి ఈ సహాయం అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాచర్ల కృష్ణవేణిని విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

# అందుబాటులో అవసరమైన ఎరువులు

అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి



**వరంగల్ వాయిస్, రేగొండ :** రైతులకు అవసరమైన యూరియా ఎరువులు తగినంతగా అందుబాటులో ఉన్నాయని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎల్.విజయలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం ఆమె రేగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎరువుల గోదామును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె యూరియా నిల్వలను, ఈ-పాస్ మిషన్ స్టాక్‌ను, స్టాక్ రిజిస్టర్ నిల్వలను, బిల్ బుక్‌లను పరిశీలించారు. గోదాముల్లో సరిపడా యూరియా అందుబాటులో ఉన్నట్లు ఆమె నిర్ధారించారు. యూరియా అవసరం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ తీసుకొని అందుబాటులోని సింగిల్ విండో గోదాముల వద్దకు వెళ్లి యూరియా తీసుకోవాలని సూచించారు. రేగొండ మండలం పీఏసీఎస్ పరిధిలోని గోదాముల్లో 1150 యూరియా అందుబాటులో ఉన్నట్లు అడిషనల్ కలెక్టర్ తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా, అందుబాటులో ఉన్న యూరియాను తీసుకువెళ్లాలని ఆమె సూచించారు. యూరియా విషయంలో ఎలాంటి వదంతులు నమ్మొద్దని, రైతుల అవసరం మేరకు యూరియా అందుబాటులో ఉందని ఆమె మరోసారి స్పష్టం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి పెద్ది వాసుదేవ రెడ్డి, సంఘం సిబ్బంది సంతోష్ పాల్గొన్నారు.

# శ్రీ మహాదేవ స్వామి ఆలయంలో పూజలు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా రఘునాథపల్లి మండల కేంద్రంలోని శ్రీ మహాదేవ స్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, రుద్రాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పిండిపోలు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. కూరెళ్ళ వేద కుమార్ దంపతులు, జనగామ వాస్తవ్యులు మంచేన హరీష్ కుమార్, కవిత దంపతులు స్వామి వారికి ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో చింతకింది కృష్ణమూర్తి, రాజేశ్వరి దంపతులు, బచ్చు చిరంజీవి గుప్త, మూర్తుల లక్ష్మణ్, లింగయ్య, మంతెన ఉప్పలయ్య, కూరెళ్ళ వినయ్ కుమార్, గండికోట మహేందర్, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారంనిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించిన 169 దరఖాస్తులు ఈ ప్రజావాణిలో వచ్చాయి. వీటిని సంబంధిత శాఖాధికారులకు చర్యల కోసం ఆదేశించారు. సీరోలు మండలం కాంపెల్లి గ్రామానికి చెందిన పుల్సాని రజిత, పుల్సాని శశిరేఖ తమ భూమి పీ.ఓ.బీ జాబితాలో ఉందని, దాని నుంచి తమ భూమిని తీసివేసి న్యాయం చేయాలని కోరారు. జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా ఎంపికైన విద్యార్థులకు వెంటనే కార్పొరేట్ స్కూళ్లలో అడ్మిషన్లు ఇప్పించాలని, వారికి కావలసిన పుస్తకాలు, ఇతర వస్తువులు ఎలాంటి రుసుము లేకుండా అందించాలని విజ్ఞప్తి చేశారు. గార్ల మండలం, మద్రిగూడెం, లోక్యాతండాకు చెందిన భూక్య కిషన్, తనకు ఉన్న భూమిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి సర్వే డిపార్ట్‌మెంట్ అనుకూలంగా నివేదిక ఇచ్చినా, అడ్డుపడుతున్నారని తెలిపారు. తన భూమిలో ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నేరెడ గ్రామానికి చెందిన రైతులు గతంలో (1970-72) జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అప్పటి ప్రభుత్వం సర్వే నెం. 545/1లో గల 4 ఎకరాల 14 గుంటల భూమిని 47 మందికి సుమారు 14 గుంటల చొప్పున ఇచ్చారని తెలిపారు. ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని, 2013-14లో తమ పేర్లు రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించారని, అట్టి భూమి ప్రభుత్వ భూమి అని దుష్ప్రచారం చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరారు. బయ్యారం మండల బయ్యారం గ్రామ పంచాయతీకి చెందిన సిరిగద్దె మంజుల, తన భర్త ఇర్సులాపురం గ్రామ పంచాయతీలో పనిచేస్తూ 2003లో మరణించారని, తనకు ఎలాంటి జీవనాధారం లేదని బయ్యారం గ్రామ పంచాయతీలో నైట్ వాచ్‌మెన్ పోస్ట్ ఇప్పించాలని కోరారు ఈ ప్రజావాణిలో జడ్పీ సీఈఓ పురుషోత్తం, డీఆర్డీఓ మధుసూధనరాజు, డీఎం ఇండస్ట్రీస్ శ్రీమన్నారాయణ, మైనారిటీ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ కృష్ణవేణి, ఇంచార్జి డీ.డబ్ల్యూ.ఓ. శిరీష, డీసీఓ వెంకటేశ్వర్లు, మత్స్య శాఖ అధికారి వీరన్న, ఎల్.డీ.ఎం.యాదగిరి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, భూభారతి కోఆర్డినేటర్ సురేష్, మండలాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డా. రాజేంద్రప్రసాద్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** బాల వికాస్ కమ్యూనిటీ హాల్‌లో నిన్న నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భారతి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఆరోగ్య మిత్ర, లిబర్టీ ఫౌండేషన్, లీడ్ ఫౌండేషన్, రోటరీ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ స్వచ్ఛందంగా అందిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి, ఆయనకు 'వింగ్స్ ఆఫ్ ఫైర్ ఎక్సలెన్స్ అవార్డు-25' ప్రదానం చేశారు.

# ప్రయాణికుల గోడు పట్టేదెవరికి!



◆ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే సరిపోతుందా?

◆ వేచిఉండడానికి షెల్టర్ ఏదీ

◆ పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

**వరంగల్ వాయిస్, దామెర :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు సదుపాయం లభించడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగింది. హనుమకొండ జిల్లాలోని దామెర మండల కేంద్రం నుంచి ఇతర పట్టణాలకు, పల్లెలనుండి మండల, జిల్లా కేంద్రాలకు, అలాగే పెద్ద నగరాలకు వివిధ అవసరాల కోసం నిత్యం ప్రజలు ప్రయాణిస్తుంటారు. అయితే, నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే ఈ మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ, వానల నుండి తలదాచుకోవడానికి ప్రయాణికులు సమీపంలోని హోటళ్లను, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో అక్కడ రద్దీ పెరిగి, దుకాణదారులు కూడా విసుక్కుంటున్నారు. నిలువ నీడ లేక, ముఖ్యంగా మహిళలు చంటి పిల్లలతో నడిరోడ్డుపై అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ప్రయాణికుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని మౌలిక వసతులతో కూడిన నూతన బస్సు షెల్టర్‌ను నిర్మించాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

### ప్రయాణికుల నరకయాతన..

**వేల్పుల రాజ్ కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు**



దామెర మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు నిలువ నీడ లేక, ఎండ, వానల్లో నడిరోడ్డుపైనే బస్సుల కోసం వేచి చూస్తూ నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటికైనా స్పందించి, ప్రయాణికుల కష్టాలను గుర్తించి, నూతన బస్ షెల్టర్‌ను నిర్మించాలి. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించి, ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి.

# పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలసముద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే కేటాయించాలని సీపీఐ జిల్లా నాయకులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీపీఐ నాయకులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ కాలనీ, జితేందర్ సింగ్ కాలనీలలో నివసిస్తున్న అర్హులైన పేద ప్రజలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని సీపీఐ నాయకులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, తప్పకుండా అర్హులైన పేద ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, నద్దునూరి అశోక్ స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకట్రాజం, వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవినీతి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా లేదని, అనర్హులకు మంజూరు చేయడం వెనుక పెద్ద కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. దీనిపై హనుమకొండ జిల్లా కలెక్టర్‌ను కలిసి వివరించినట్లు ఒంటేరు చక్రి తెలిపారు. అర్హులు కాని వారికి అర్హత పత్రాలు జారీ చేసిన నాయకులు, అధికారులు పేదల సొంత ఇంటి కలను అందని ద్రాక్షగా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో గతంలో లబ్ధిదారులైన వారికి, గృహలక్ష్మి పథకం వచ్చిన వారికి, సగం పూర్తయిన ఇళ్లకు కొన్ని నిబంధనలు పెట్టి అనర్హులుగా ప్రకటించినప్పటికీ, స్థానిక నాయకులు, అధికారులు, ఇందిరమ్మ కమిటీ నాయకులు వాటిని తుంగలో తొక్కి అవినీతికి పాల్పడుతున్నారని చక్రి ఆరోపించారు. నిజమైన అర్హులకు కాకుండా తిరిగి అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, నాయకులు, ఇందిరమ్మ కమిటీ నాయకులు, కార్యకర్తలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. పేద ప్రజలకు వ్యతిరేకంగా తీర్మానం చేసిన అధికారులపై వెంటనే విచారణ జరిపి, చట్టరీత్యా చర్యలు తీసుకుని పేదలకు న్యాయం చేయాలని, నిజంగా అర్హులైన వారికి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, దామెర :** ఇటీవల గడ్డి మందు తాగి మరణించిన మోతే బాలకృష్ణ కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు, జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి సోమవారం దామెర మండలం ఊరుగొండ గ్రామంలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పొడల మధుకర్, వెంకట్రాములు, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జి గండు పరశురాం, బూత్ అధ్యక్షులు నూకల రవీందర్, గడ్డం కాళీయువసేన అధ్యక్షులు కార్తీక్, పురాణం వివేక్, చిన్నపల్లి నాగరాజు, దాసరి రాజు, పత్తి రమేష్, చిల్ల అశోక్ పాల్గొన్నారు.

# చేనేత సహకార సంఘాల రుణాలన్నీ మాఫీ చేయాలి

◆ తాటిపాముల వెంకట్రాములు డిమాండ్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత పరిశ్రమను ఆదుకునేందుకు, చేనేత సహకార సంఘాల రుణాలన్నింటినీ మాఫీ చేసి, తిరిగి రుణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైమాయత్‌నగర్‌లోని రాజ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి పెండెం సర్వేశం అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రాములు ప్రసంగించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందని, కార్మికులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు ప్రకటించిన రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా మాఫీ చేయాలని, అప్పుల ఊబిలో కూరుకుపోయిన సహకార సంఘాలు కార్మికులకు పని కల్పించలేకపోతున్నాయని పేర్కొన్నారు. వెంటనే సహకార సంఘాల అన్ని రకాల రుణాలను పూర్తిగా మాఫీ చేసి, తిరిగి రుణ సౌకర్యం కల్పించాలని ఆయన పునరుద్ఘాటించారు. ఆత్మహత్యలకు పాల్పడిన నేతన్నల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియో చెల్లించాలని కూడా డిమాండ్ చేశారు. అలాగే, కేంద్రం చేనేతపై జి.ఎస్.టి.ని తొలగించాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనరసయ్య ప్రసంగిస్తూ, నేతన్న భరోసా పథకంలో సంవత్సరానికి పది వార్పులు నేయాలన్న నిబంధనను తొలగించాలని కోరారు. గత 12 ఏళ్లుగా ఎన్నికలు జరపకపోవడంతో సంఘాలు నిర్వీర్యమై, కార్మికులకు పనులు కల్పించలేకపోతున్నాయని, వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని కూడా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత రాష్ట్ర నాయకులు జల్ది రాములు, కొలిపాక సంపత్, వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు దీటి నరసయ్య, బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



**వరంగల్ వాయిస్, సంగెం :** పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు సంగెం మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి ఆధ్వర్యంలో నేడు సంగెం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిన్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేపట్టిన కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) చేసిన అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఈ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి మాట్లాడుతూ కేటీఆర్, ధర్మారెడ్డి నిజా నిజాలు తెలుసుకోకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. వారికి దమ్ము, ధైర్యం ఉంటే ప్రజల్లోకి రావాలని, ముఖ్యంగా యూరియా అక్రమ రవాణా ఘటన జరిగిన నల్లబెల్లికి వచ్చి, వాస్తవాలు తెలుసుకోవాలని సవాల్ విసిరారు. నల్లబెల్లిలో యూరియా అక్రమ రవాణా జరుగుతుండగా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న యూరియా బస్తాలను అడ్డుకుని, వాటిని గ్రామ పంచాయతీకి అప్పగించి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారని మాధవరెడ్డి వివరించారు. దీనిపై సరైన విచారణ జరిపి దోషులను శిక్షించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అయితే, ఈ విషయంపై కేటీఆర్ పూర్తిస్థాయిలో తెలుసుకోకుండా, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేసే విధంగా తన అహంకార పూరిత వైఖరితో మాట్లాడారని మాధవరెడ్డి ఆరోపించారు. మహిళా రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం నాన్–బెయిలబుల్ కేసు పెట్టిందని వ్యాఖ్యానించడం సిగ్గుచేటని, అసలు మహిళపై కేసు నమోదు కాలేదని ఆయన స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్‌లో అటువంటి కేసు ఏమైనా నమోదైందో లేదో తెలుసుకోకుండా కేటీఆర్ అసత్యపు మాటలు మాట్లాడటం "దొంగే దొంగ దొంగా" అని అరిచినట్లుగా ఉందని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులు, ప్రజలు బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తమ ప్రజా ప్రభుత్వంపై ఇలాంటి అబద్ధాలు వేసి, కాంగ్రెస్ పార్టీని కావాలని బద్నాం చేయాలని చూస్తే, రాబోయే ఎన్నికలలో ప్రజలు కేటీఆర్, టీఆర్ఎస్ పార్టీ తరపున ఎన్నికలలో నిలబడే అభ్యర్థులకు తగిన బుద్ధి చెబుతారని వార్నింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రావుల శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్పల్లి రమేష్, మార్కెట్ డైరెక్టర్ అచ్చ నాగరాజు, నరసింహ నాయక్, మాజీ సర్పంచులు కిషోర్, ఇండ రవి, మేకల అనిల్, గోపతి రవి, జగన్నాచారి, కవిత ఆగపాటి రాజు, ఎండి పాషా, అంజన్ రావు, పులి సాంబయ్య, మండల పార్టీ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, మహిళా నాయకురాళ్లు, వివిధ గ్రామాల ఇంఛార్జిలు పాల్గొన్నారు.

# పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధికి నిధుల వరద

## ● ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు రానున్నాయని ఎమ్మెల్యే నాయిని తెలిపారు .హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాన రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, హనుమకొండ జిల్లాలో రూ. 467 కోట్లతో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వరంగల్ నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన అభివృద్ధి జరగబోతుందని ఆయన పేర్కొన్నారు. గతంలో అభివృద్ధి పలుకులు పలికిన నాయకులు నేడు కనుమరుగయ్యారని నాయిని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ. 205 కోట్ల నిధులను విడుదల చేసిన ఘనత తమదని అన్నారు. కేటీఆర్, ధర్మారెడ్డిలను ఉద్దేశించి "కార్టూన్ గాళ్లకు ఎలాంటి పనిలేక మాట్లాడుతున్నారు... పేపర్ మేనేజ్‌మెంట్ కోసం రోజు తహతహ పడుతున్నారు" అంటూ ఎద్దేవా చేశారు. "కులేశ్వరం కట్టింది మీరే మళ్లీ నిర్మాణం చేపట్టాలని చెప్పేది మీరే" అంటూ గత ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించారు. "బీజేపీలో విలీనం చేస్తాం అని చెప్పిన మాటపై ఎందుకు స్పందించడం లేదు?" అని కేటీఆర్‌ను అడిగారు. "సీఎం రమేష్ ను కలిసి సమావేశంలో ఆంతర్యం ఏంటి?" అని నిలదీశారు. "బాలికల హాస్టళ్ళలో అన్యాయంగా వెళ్లాలని చూస్తే బాగోదు" అంటూ హెచ్చరించారు. "గతంలో మీ అయ్య మాట్లాడిన భాషలపై పునఃపరిశీలన చేసుకో" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణకు బీఆర్ఎస్ ప్రథమ శత్రువు" అని నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. పనిచేసే వారెవరో, పనికిమాలిన వారెవరో గమనించండి" అంటూ ప్రజలకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో దళారులకు అవకాశం లేకుండా చేస్తున్నామని ఎమ్మెల్యే నాయిని తెలిపారు. పదేళ్లలో అంబేద్కర్ నగర్, జితేందర్ నగర్ వాళ్ళను గత నాయకులు మోసం చేశారని, అయితే గడిచిన 18 నెలలుగా నిజమైన అర్హులకు న్యాయం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. అభివృద్ధి పనులలో ఇళ్లను కోల్పోతున్న వారికి, వరదలలో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ రావు, టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, వేముల శ్రీనివాస్, అనుబంధ సంఘాల చైర్మన్‌లు బంక సారళ, విక్రమ్, అజీజ్ ఉల్లా, పెరుమాండ్ల రామకృష్ణ, రాజ్ కుమార్, శ్రవణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబేద్కర్ రాజు, నాయకులు లక్ష్మారెడ్డి, బంక సంపత్, గుంటి స్వప్న, రహీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

# కుడా చైర్మన్‌కు నాగ పంచమి మహోత్సవ ఆహ్వానం



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** మండలంలోని క్యాతంపల్లి గ్రామంలో కొలువైన ఓషధీశ్వర మానసాదేవి సహిత నవనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి (నవనాగ క్షేత్రం) దేవస్థానంలో రేపు జరగనున్న నాగ పంచమి మహోత్సవానికి హాజరు కావాలని, ఆలయ వ్యవస్థాపకులు గంటా సీతారామారావు, యూత్ కాంగ్రెస్ నేషనల్ సెక్రెటరీ గొట్టిముక్కుల సాగరిక రమాకాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కుల రమణా రెడ్డి నేడు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు.

# నూతన ఎస్సై దివ్యకు అభినందనలు



**వరంగల్ వాయిస్, కొత్తపల్లి గోరి :** కొత్తపల్లి గోరి మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్ మొదటి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సాకపురం దివ్యను పలువురు నాయకులు, ఆర్ఎంపీ వైద్యులు కలిసి అభినందించారు. సోమవారం, కొత్తపల్లి కె కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు జువ్వాజీ వీరస్వామి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఎస్సై సాకపురం దివ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో ఎస్సై చేపట్టే ప్రతి కార్యక్రమానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. అనంతరం ఎస్సైకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ప్రజల సహకారం ఉన్నంతవరకు మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కల్లేపల్లి కైలాసం, ముదిరాజ్ సొసైటీ చైర్మన్ నూనె మొగిలి, మాజీ సొసైటీ చైర్మన్ చెక్క రవి, మదాసు మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (USPC) ఆధ్వర్యంలో జరగనున్న మూడు దశల పోరాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూఎస్పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు నన్నెబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సుబేదారి ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన యూఎస్పీసీ హనుమకొండ, వరంగల్ జిల్లాల స్టీరింగ్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని, ఆగస్టు 23న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహిస్తామని నన్నెబోయిన తిరుపతి తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఏ. శ్రీనివాసరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు ఊటుకూరి అశోక్, కడారి భోగేశ్వర్, పెండం రాజు, సుజన్ ప్రసాదరావు, కట్కూరి శ్రీనివాస్, ఆకుల గోవిందరావు, గోడిశాల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు రాజయ్య, జి. ఉప్పలయ్య, కే. శ్రీనివాస్, డి. మహేందర్ రెడ్డి, గోవర్ధన్, పి. జగన్మోహన్, మహేందర్ రావు, ఏ. మల్లయ్య, బి. మహేందర్ రావు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు గుర్తింపు కార్డుల అందజేత



**వరంగల్ వాయిస్. జనగామ :** నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్.హెచ్.ఎం.) కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) ఆధ్వర్యంలో జనగామ జిల్లాలోని ఉద్యోగులకు ఎన్.హెచ్.ఎం. ఐడీ కార్డులను అందజేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, జనగామ జిల్లా అధ్యక్షురాలు గంగారబోయిన జ్యోతితో పాటు ఇతర సభ్యులు గుర్తింపు కార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సారంగుల బాలసుబ్రమణ్యం, జనగామ జిల్లా ఎన్.హెచ్.ఎం. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కవిత, పద్మ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నియంత్రణపై క్వార్టర్లీ సమీక్ష

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్:** జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య , ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం హెచ్ఐవీ/ ఎయిడ్స్ నియంత్రణపై క్వార్టర్లీ సమీక్ష సమావేశం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ హెచ్ఐవీ నిర్ధారణ, చికిత్స, అవగాహన కార్యక్రమాల నిర్వహణ పట్ల ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో హెచ్ఐవీ పాజిటివ్ కేసుల వివరాలు, వారు పొందే సేవలు, ఏఆర్టీ సెంటర్ల పనితీరు, టార్గెట్ గ్రూపులకు (F-SW, MSM, TG, Migrants) అందజేసే సేవలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రతి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని, నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునే విధంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి. రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ కే. జ్యోతి, క్లినికల్ సర్వీసెస్ ఆఫీసర్ సారయ్య, సీపీఓ మహేష్, ఐసీటీసీ (ఐసీటీసీ) స్టాఫ్ రమేష్, ఎన్జీవోలు, లింక్ వర్కర్స్ పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

## ● జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నడికూడ :** భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం నడికూడ మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాల సమావేశం నిర్వహించింది. మారుతీ గార్డెన్స్ లో ఎరుకల దివాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు, పరకాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి డా. పగడాల కాళీ ప్రసాద్ రావు ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోటీ చేసేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకే కాదు, గ్రామీణ ప్రాంతవాసులకు సంక్షేమ పథకాలను అందిస్తున్నది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమేనని అన్నారు. ఇదే అభివృద్ధి మంత్రాన్ని ప్రజలకు వివరిస్తామని, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి అని, గ్రామస్థాయి వార్డు మెంబర్ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ వరకు బీజేపీ అభ్యర్థులే గెలవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యకర్తల బలం ఉన్న పార్టీ బీజేపీదేనని, వారి కష్టాన్ని ఎప్పటికీ మర్చిపోమని పేర్కొన్నారు. భారత ప్రధాని మోడీ సర్కార్ మూడు నెలల రేషన్ బియ్యం ఇచ్చిందని గుర్తు చేస్తూ, రైతులకు బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. గ్రామాల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. జయంత్ లాల్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మేకల రాజవీర్, స్థానిక సంస్థల నడికూడ మండల ఎన్నికల ప్రభారి మార్త బిక్షపతి, జిల్లా కౌన్సిల్ మెంబర్ గోగుల రాజిరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి సింగవేనా రవీందర్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శులు తిప్పారాపు సుధీర్, దండు సురేష్, మండల పదాధికారులు, జిల్లా పదాధికారులు, బూత్ అధ్యక్షులు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే నాగరాజు, చైర్మన్ జంగా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా 64వ డివిజన్ పరిధిలోని టేకులగూడెం అభివృద్ధి కుంటుపడిందని వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం టేకులగూడెం గ్రామంలో సుమారు రూ. 30 లక్షల జీడబ్ల్యూఎంసీ సాధారణ నిధులతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు గౌరవ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్జంగా రాఘవరెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మాచర్ల అరుణ – కుమారస్వామి, ఆరుముళ్ల భారతమ్మల ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి, ఆడబిడ్డ కట్నం అందజేశారు. నిర్ణీత కాల వ్యవధిలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు తెలియజేస్తూ, వారిని ఎమ్మెల్యే నాగరాజు, చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో టేకులగూడెం గ్రామానికి తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాము అధికారంలోకి వచ్చిన క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. చారిత్రాత్మక వరంగల్ నగరాన్ని తెలంగాణ రెండవ రాజధానిగా చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగర అభివృద్ధి, వరంగల్ విమానాశ్రయం, మెగా టెక్స్‌టైల్ పార్క్, భద్రకాళి దేవస్థానం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు, రైల్వే అభివృద్ధికి కృషి చేస్తున్నారని వివరించారు. ఈ డివిజన్ మామునూర్ ఎయిర్‌పోర్ట్‌తో అభివృద్ధిలో చాలా ముందుకు వెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై గౌరవం లేకుండా కేటీఆర్, కౌశిక్ రెడ్డి "పిచ్చి కుక్క కరిసినోడు లాగా ఏది పడితే అది మాట్లాడుతున్నారని" తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు కవిత జాగృతి పేరుతో ప్రజలను మభ్యపెడుతూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ వారికి కర్రు కాల్చి వాత పెట్టడం తథ్యమని హెచ్చరించారు. టీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒకటే అని ప్రజలందరికీ తెలుసన్నారు. అలాగే, టేకులగూడెం గ్రామంలో ఉన్న పలు సమస్యలను దశలవారీగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రామాలయ అభివృద్ధికి విరాళం

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు ముసునూరు నరేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపురం మండల కేంద్రానికి చెందిన కట్టుకూరి రాధిక, శ్రీనివాస్ దంపతులు తమ కుమార్తె కటకూరి అశ్విని జ్ఞాపకార్థంగా ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ.10,116 నగదును ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్‌కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూల శ్రీనివాస్ గౌడ్, బటిక స్వామి, దైవాల భద్రయ్య, పాండవుల భద్రయ్య, మాదాసు అర్జున్, బూర రాజగోపాల్, మాదాసు మొగిలి, ఉయ్యాల బిక్షపతి, గోరంట్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'మై ఆటో ఈజ్ సేఫ్' క్యూఆర్ కోడ్ వ్యవస్థ ప్రారంభం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా ప్రజలకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో, మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ త్వరలో 'మై ఆటో ఈజ్ సేఫ్' (My Auto is Safe) అనే క్యూఆర్ కోడ్ వ్యవస్థను ప్రారంభించనుంది. ఇందులో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సర్వయ్య, ట్రాఫిక్ ఎస్సై అరుణ్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది జిల్లాలోని ఆటో, రిక్షా డ్రైవర్లందరితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో 'మై ఆటో ఈజ్ సేఫ్' క్యూఆర్ కోడ్ స్టిక్కర్లపై పూర్తి అవగాహన కల్పించారు. టౌన్ పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఆధార్ కార్డ్, ఆర్సీ కార్డ్, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, మొబైల్ నెంబర్ వెంట తెచ్చుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆటో, రిక్షాలకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు జత చేయబడతాయి. వీటి ద్వారా ప్రయాణికులకు, ముఖ్యంగా మహిళలకు, పిల్లలకు, వృద్ధులకు సురక్షితమైన, నిబంధనల మేరకు నడిచే ప్రయాణ సేవలు అందుబాటులోకి వస్తాయి.

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఈర్షద్‌కి సన్మానం



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఈర్షద్ కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా సోమవారం మహాదేవపూర్‌లో ఆయనను మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకారి రాజబాబు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ టౌన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సుందర్, కాళేశ్వరం యూత్ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నిట్టూరి నగేష్ పాల్గొన్నారు.

## జిల్లాలో భారీ వర్షాలు, వరదలపై సమీక్ష



**వరంగల్ వాయిస్, ములుగు:** ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి, ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె. శశాంక ములుగు జిల్లా పర్యటనలో భాగంగా ఐటీడీఏ, ఏటూరునాగారం సమావేశ మందిరంలో సోమవారం అధికారులతో భారీ వర్షాలు, వరదలపై సంసిద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, ఎస్పీ శబరిష్, రెవెన్యూ అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్ జి, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, ఏపీఓ వసంత రావు, మున్సిపల్ కమిషనర్ సంపత్, జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకోవాలి

కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఈ శ్రావణమాసంలో పోచమ్మ, మహంకాళి, మడేలయ్య బోనాలను ఘనంగా నిర్వహించుకోవాలని 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్ పిలుపునిచ్చారు. బోనాల పండుగలను పురస్కరించుకుని మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా రంగశాయిపేట పోచమ్మ దేవాలయంలో జరుగుతున్న పెయింటింగ్ పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుండు చందన పూర్ణచందర్ మాట్లాడుతూ ఈ శ్రావణమాసంలో నిర్వహించే బోనాల పండుగల కోసం రంగశాయిపేటలోని పోచమ్మ దేవాలయం, ఉర్సు చిన్న మహంకాళి దేవాలయం, బేస్తం చెరువు మడేలయ్య దేవాలయాల్లో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా పెయింటింగ్ పనులు చేయిస్తున్నామని తెలిపారు. ఈ బుధవారం రంగశాయిపేట పోచమ్మ దేవాలయంలో, చిన్న మహంకాళి దేవాలయంలో వడ్ల, కమ్మరి, కుమ్మరి కులస్తులు తొలి బోనాలను సమర్పిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. వీరు తొలి బోనాలు సమర్పించిన తర్వాత డివిజన్ ప్రజలందరూ కూడా ఈ శ్రావణమాసంలో ప్రతి ఆదివారం, బుధవారం రోజున బోనాల పండుగలను నిర్వహించుకోవచ్చునని తెలిపారు. అంతేకాకుండా, మడేలయ్య దేవాలయంలో రంగశాయిపేటలోని రజక కులస్తులు శుక్రవారం రోజున బోనాల పండుగను నిర్వహించుకుంటున్నారని ఆమె చెప్పారు.

## గర్భిణులకు పోషకాహార కిట్లు అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాజసేవా కార్యక్రమాల్లో భాగంగా రోటరీ క్లబ్, వరంగల్ నేడు రంగశాయిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు పోషకాహార కిట్లను అందజేసింది. క్లబ్ అధ్యక్షుడు కొండూరు శివప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ హెల్త్ చైర్‌పర్సన్ డా.హరి రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అభ్యుదయ సేవాసంస్థ బాధ్యుడు మండల పరుశురాములు, రోటరీ సభ్యులు మామిడాల రమేష్ బాబు, తోట నాగరాజు, అనంతుల కుమారస్వామి, సదానందం, అలాగే పీహెచ్‌సీ వైద్యాధికారి డా.రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## రేగ కళ్యాణికి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సన్మానం



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** ఇటీవల నూతనంగా ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన రేగ కళ్యాణిని సోమవారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ తో పాటు అసోసియేషన్ సభ్యులు కళ్యాణికి పుష్పగుచ్ఛం అందజేయడంతో పాటు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం కళ్యాణితో బాదం ప్రవీణ్ మార్కెట్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఆ తర్వాత మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పేద సారంగంకు, మార్కెట్ సెక్రటరీ సోనియాకి కూడా శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందరావుపేట్ పీఏసీఎస్ చైర్మన్ ఎల్లారెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి సహోదర రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, జిల్లాలోని పలువురు రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# తెలుగు సంప్రదాయాలను పాటిస్తున్న ఎన్నారైలు

◆ అమెరికాలో ఘనంగా ఆషాఢ మాస గోరింటాకు ఫెస్టివల్ నిర్వహణ



**వరంగల్ వాయిస్, అమెరికా/ జార్జియా :** తెలుగు సాంప్రదాయాలను విదేశాల్లో నిలబెట్టే ప్రయత్నంలో భాగంగా, ఆహా ఈవెంట్స్ , హ్యాపీ ఫ్యామిలీ ఫార్మ్స్ సంయుక్తంగా జూలై 20న సవానీలోని శ్రీ లలితాదేవి దేవాలయంలో ఆషాఢ మాస గోరింటాకు సేవను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించాయి. ఈ కార్యక్రమం ఉచితంగా అందరికీ అందుబాటులో తీసుకురావడం విశేషం. ఈ పవిత్ర సేవలో 75 మంది మహిళలు గోరింటాకు పెట్టుకొని పాల్గొన్నారు. వానపాటలతో, ముచ్చట్లతో, రంగుల చీరలతో ఊరేగిన ఈ వేడుక ఒక ఆధ్యాత్మిక పండుగలా సాగింది. గోరింటాకు మొక్కలు కూడా అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమ కుటుంబాలతో హాజరైన మహిళలు పెద్ద ఎత్తున ఈ మొక్కలను స్వీకరించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో లలితా అమ్మవారికి విశిష్ట పూజలు, అలంకారాలతో అభిషేకం నిర్వహించారు. ఆహా ఈవెంట్స్, హ్యాపీ ఫ్యామిలీ ఫార్మ్స్ వ్యవస్థాపకురాలు హారిక తెలుగు సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు పరిచయం చేయడమే తమ ముఖ్య ఉద్దేశమంగా పని చేస్తున్నారు. ఆషాఢ మాసంలో గోరింటాకు సేవను ఉచితంగా అందించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇది తెలుగు సంస్కృతికి గౌరవంగా భావించాల్సిన విషయం.



# సరైనోడు కర్నాటి వరుణ్ రెడ్డి

గడ్డం కేశవమూర్తి
Cell:9390101862



- టీజీ ఎన్ పీడీసీఎల్ సీఎండీగా ప్రత్యేక గుర్తింపు
- జీరో ప్రమాదాలే లక్ష్యంగా అడుగులు
- అంతరాయాలు లేని విద్యుత్ సరఫరాకు కృషి
- వినియోగదారులు, ఉద్యోగుల శ్రేయస్సుకు మొదటి ప్రాధాన్యం
- ఆధునిక సాంకేతికత పద్దతుల అమలు

విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా క్షేత్రస్థాయిలో దానిని సరఫరా చేసేందుకు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి నిర్దిష్టమైన చర్యలను తీసుకున్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా చూస్తున్నారు. 17 జిల్లాల పరిధిలో 72.35 లక్షల వినియోగదారులు, 14.49 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నప్పటికీ నిరంతరాయంగా విద్యుత్తును అందిస్తున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎక్కడ అంతరాయం ఏర్పడినా వెంటనే పునరుద్ధరించేలా మెన్, మెటీరియల్ ను సిద్ధంగా ఉంచారు. హైపర్ అనే కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. ఓవర్ లోడుతో ఉన్న 33, 11 కేవీ ఫీడర్లు, పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లను గుర్తించి వాటికి అనుబంధంగా మరికొన్నింటిని ఏర్పాటు చేశారు. ఫీడర్లలోను అంతరాయాలు లేకుండా ఒకే సమయంలో లైన్ క్లియర్ చేయిస్తున్నారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు, ఇతర ఘటనలు జరిగినప్పుడు కలిగే అంతరాయాలను నివారించడానికి విద్యుత్ ఉప కేంద్రాల మధ్య ఇంటర్ లింకులను ఏర్పాటు చేశారు. సైది, సైఫి గణాంకాల ద్వారా తరచుగా విద్యుత్ అంతరాయాలు జరిగే లీడర్లపై దృష్టి సారించి మరోసారి జరగకుండా చర్యలు తీసుకున్నారు. దీనివల్ల విద్యుత్ వినియోగదారులకు అంతరాయాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా రియల్ టైం మానిటరింగ్ సిస్టం ద్వారా సమస్య ఏర్పడిన చోటును వెంటనే గుర్తించి సమస్యను పరిష్కరిస్తున్నారు. వ్యవసాయ రైతులు, వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడం, భద్రతపై వారికి అవగాహన కల్పించేందుకు 'పొలం బాట' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో నెట్వర్క్ లో వదులుగా ఉన్న లైన్లు, వంగిన, దెబ్బతిన్న స్తంభాలు, ఫీడర్లలో లోపాలుంటే తక్షణం సిబ్బంది మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆటో స్టార్టర్లను తొలగించి కెపాసిటర్లు పెట్టుకోవాలని వరుణ్ రెడ్డి సూచించారు. వినియోగదారుల హెచ్ టీ 11 కేవీ, 33 కేవీ ఆపై ఓల్టేజ్ సర్వీసుల మంజూరు వేగవంతం చేయడానికి సింగిల్ విండో వ్యవస్థను ప్రవేశపెట్టారు.

## రెవెన్యూ వసూళ్లపై ప్రత్యేక దృష్టి..

రెవెన్యూ వసూళ్లు, బకాయిలపై ఆయన ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. విద్యుత్ బిల్లులు చెల్లించని సర్వీసులపై దృష్టి సారించి వాటిని రాబట్టే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచిత నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో లక్షలాది మందికి జీరో బిల్లులు అందజేశారు. వ్యవసాయ భూముల వద్ద ఉన్న స్తంభాలకు ప్రత్యేక యూనిక్ నెంబర్ ను కేటాయించి దానికి జియో ట్యాగింగ్ సైతం ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గించడంలో యూనిక్ పోల్ నంబరింగ్ కీలకపాత్ర పోషిస్తున్నది. ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతికంగా విద్యుత్ సమస్యల వలన ఏర్పడే అంతరాయాలను తగ్గించడానికి బ్రేక్ డౌన్ టీంలను ఏర్పాటు చేశారు. మారుమూల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అత్యవసర పునరుద్ధరణ బృందాలను ఏర్పాటు చేసి వారికి వాహనాలను సమకూర్చారు. గృహ, వ్యవసాయానికి సంబంధించిన నూతన కనెక్షన్లు తీసుకోవాలని వినియోగదారులు, రైతులకు సులభతరంగా అర్థమయ్యే రీతిలో వాటిక అయ్యే అంచనా వ్యయ వివరాలను తెలుగులోనే అందిస్తున్నారు. దరఖాస్తు ఏ దశలో ఉందనేది వారికి ఎస్ఎంఎస్ ల ద్వారా పంపే ఏర్పాట్లు చేయించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తు వారి ఫిర్యాదులను సత్వరం పరిష్కరిస్తున్నారు. అలాగే వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా ఆన్ లైన్ ఎల్ సీ యాప్ ను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు.














## అప్రమత్తే శ్రీరామ రక్ష..

ప్రస్తుత వర్షాకాల సీజన్ లో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలంటున్నారు సీఎండీ వరుణ్ రెడ్డి. వినియోగదారులు సొంతంగా విద్యుత్ కు సంబంధించిన పనులు ఎట్టి పరిస్థితుల్లో చేయకూడదంటున్నారు. ప్రతి వైర్ లో కరెంట్ ప్రసారం అవుతుందన్న అవగాహనతో మెలగాలంటున్నారు. విద్యుత్ వైర్లు, లైన్లు, స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నట్లు గుర్తిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆయన సూచిస్తున్నారు. మేనేజ్మెంట్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూనే.. జీరో ప్రమాదాల నిర్దేశిత లక్ష్యంగా ప్రతి విద్యుత్ ఉద్యోగి భద్రత ప్రమాణాలు పాటించేలా సీఎండీ చర్యలు తీసుకున్నారు.

## ఆధునిక సాంకేతికత అమలు..

ఎన్పీడీసీఎల్ లో వరుణ్ రెడ్డి ఆధునిక సాంకేతికతను అభివృద్ధి చేశారు. పేపర్ లెస్ విధానాన్ని అవలంబిస్తూ ప్రతీ పనిని ఆన్ లైన్ ద్వారా చేయిస్తున్నారు. కొత్త సర్వీస్ కనెక్షన్లు, లయన్ షిఫ్టింగ్, ఫిర్యాదులు, దరఖాస్తుల స్థితిగతులు, చెల్లింపులు అన్నీ కూడా ఆన్ లైన్ ద్వారా చేపడుతున్నారు. రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఉండేలా.. ఎస్టిమేట్ వివరాలు తెలుగులో అందిస్తున్నారు. సాంకేతికంగా విద్యుత్ సమస్యల వల్ల ఏర్పడే అంతరాయాలను తగ్గించేందుకు ఎమర్జెన్సీ పవర్ రీస్టోర్ టీం వాహనాలను వాడుతున్నారు. పాత సబ్ స్టేషన్లు పునరుద్ధరించారు. అవసరాల మేరకు కొత్త సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నారు. కొత్త సాంకేతికతను అందిపుచ్చుకొని వేగవంతంగా విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టంను ప్రవేశపెట్టారు. దీనిని సత్వరం అమల్లోకి తీసుకువచ్చిన ఆయన యుద్ధ ప్రాతిపదికను మరమ్మతులు చేసి విద్యుత్తును పునరుద్ధరిస్తున్నారు.

## అవార్డుల పంట..



సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డితో పాటు ఆయన టీం అందిస్తున్న ఉత్తమ సేవలకు గాను ఎన్పీడీసీఎల్ కు అవార్డుల పంట పండింది. వినియోగదారులకు ఉత్తమమైన సేవలు, మెరుగైన విద్యుత్ సరఫరా, పంపిణీ, నష్టాలు తగ్గుదల, సోలార్ ప్రోత్సాహం అందించినందుకు పల అవార్డులు దక్కాయి. అలాగే కన్జ్యూమర్ సర్వీసింగ్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్ లో కూడా జాతీయస్థాయి ర్యాంకు లభించింది. వినియోగదారులకు అందిస్తున్న మెరుగైన సేవల్లో భాగంగా త్వరితగతిన సర్వీసుల మంజూరు, మీటరింగ్, బిల్లింగ్ ప్రక్రియ వేగవంతం, ఫిర్యాదుల పరిష్కారంలో జవాబుదారీతనం, కార్యాచరణలో ముందు ఉండటం ద్వారా ఈ ర్యాంకు దక్కింది. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ అధికార యంత్రాంగం సమిష్టిగా కృషి చేయడం ద్వారా ఈ అవార్డులు విద్యుత్ సంస్థకు లభించాయి. సీఎండీ వరుణ్ రెడ్డి మరింత రెట్టింపు ఉత్సాహంతో మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, జూలై 28, 2025

# కార్పొరేట్ కబంధహస్తాల్లో చదువులు

- నటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణ మూర్తి
- విద్యార్థి నాయకులతో కలిసి సినిమా వాల్ పోస్టర్ల విడుదల



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కార్పొరేట్ కబంధ హస్తాల్లో చదవు చిక్కుకున్నదని, చదువుకునే రోజుల నుంచి చదువు కొనుక్కునే పరిస్థితులు ఏర్పడ్డాయని విప్లవ చిత్రాల దర్శక, నిర్మాత, నటుడు ఆర్.నారాయణ మూర్తి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్నేహ చిత్ర పిక్చర్స్ తెరకెక్కించిన 'యూనివర్సిటీ' సినిమా వాల్ పోస్టర్ లను హనుమకొండలోని ప్రెస్ క్లబ్ లో సోమవారం వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి నారాయణ మూర్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ చూసినా పేపర్ లీకేజ్ అనేది సర్వసాధారణంగా మారిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలతోపాటు ఎంబీబీఎస్, ఇంజినీరింగ్ విద్యార్థుల పరీక్ష పత్రాలు లీక్ అవ్వడం అంటే ఈ సమాజాన్ని నాశనం చేయడమే అని అన్నారు. కార్పొరేట్ కబంధహస్తాల్లో ఈరోజు విద్య ఇరుక్కు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సేవా రంగంగా ఉండాల్సిన విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపార రంగంగా మార్చారని మండిపడ్డారు. తన సినిమాని ప్రజలు, కవులు, కళాకారులు, మేధావులు, నిరుద్యోగులు విద్యార్థులు అధిక సంఖ్యలో చూసి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్, పీడీఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్, ఎస్ఎఫ్ఐ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు సాయి మాట్లాడుతూ కలామతల్లి ముద్దుబిడ్డ నారాయణ మూర్తి సామాజిక అసమానతలపై, విద్య, వైద్యం, క్లాసిఫికేషన్, క్యాస్టిఫికేషన్ అంశాలపై తన జీవితాన్ని సినిమా రంగానికి అంకితం చేసి పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, సినిమా రూపంలో ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ వెండితెరపై దశాబ్దాలుగా మన జీవితాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకు కట్టినట్టు చూపిస్తున్నారన్నారు. ఇది కేవలం సినిమా మాత్రమే కాదని, విద్యార్థుల జీవన పరిణామ క్రమంలో వర్సిటీలో ఎదురయ్యే సమస్యలను కళ్లకు కట్టినట్లు ఈ సినిమాలో చూపించడం జరిగిందని తెలిపారు. ఆగష్టు 21న విడుదల అయ్యే యూనివర్సిటీ చిత్రాన్ని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, మేధావులు, కవులు, కళాకారులు సినిమాను ఆదరించి వీక్షించి ప్రమోట్ చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కసర బోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు సిపతి వినయ్, పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, పీడీఎస్ యూ యూనివర్సిటీ అధ్యక్షుడు విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్, నాయకులు వినయ్, హర్షద్ తదితరులు పాల్గొన్నారు.



## నారాయణ మూర్తిని కలిసిన నిమ్మల

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఎన్నో సామాజిక అంశాలను ఇతివృత్తంగా చేసుకొని చిత్రాలుగా నిర్మించిన ప్రముఖ దర్శకులు, నటులు, నిర్మాత ఆర్.నారాయణ మూర్తిని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన కార్యక్రమానికి విచ్చేసిన ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయన చిత్రాలను చూసి అనేకమంది ప్రభావితమయ్యారని, ఏ రోజు కమర్షియల్ సినిమాలో నటించలేదని, విలువలకు కట్టుబడి ఉన్న ఏకైక నటుడని కొనియాడారు. వారి సాదారణ జీవితం ఎంతోమందికి ఆదర్శమని పేర్కొన్నారు. వారు నిర్మించిన 'యూనివర్సిటీ' చిత్రం ఆగస్టు 21న విడుదల కానున్నందున విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, వారిని అభినందించారు.

# యువత సాధికారతపై దృష్టి సారించాలి

- లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలోని యువత సాధికారతపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. తెలంగాణలోని యువత సాధికారతకు కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలపై లోక్‌సభలో డాక్టర్ కడియం కావ్య ప్రశ్నించారు. యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, వ్యవస్థాపకత లక్ష్యంగా తీసుకొచ్చిన పథకాల వివరాలను తెలియ జేయాలని కేంద్ర మంత్రిని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు. డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా సమాధానం ఇచ్చారు. రాష్ట్రీయ యువ శక్తికరణ్ కార్యక్రమ్ (ఆర్వైఎస్కే), నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్), మై భారత్ వంటి కార్యక్రమాలు తెలంగాణలో అమలవుతున్నాయని వివరించారు. మై భారత్ 2025–26 వార్షిక ప్రణాళికలో భాగంగా వరంగల్ సహా రాష్ట్రంలోని జిల్లాల్లో 'ఏక్ పెడ్ మా కే నామ్', 'స్కిల్స్ ఫర్ సక్సెస్', 'జిల్లా స్థాయి క్రీడా పోటీలు', 'విక్షిత్ భారత్ –యువ ఉత్సవ్' లాంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఇక తాజాగా ప్రకటించిన రూ.2 లక్షల కోట్ల ప్రధానమంత్రి ప్యాకేజీ ద్వారా ఐదేళ్లలో 4.1 కోట్ల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. 'ఖేలో ఇండియా', 'ఫిట్ ఇండియా', 'పిఎమ్ఈజీపీ', 'స్కిల్ ఇండియా మిషన్' వంటి జాతీయ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో మరింత వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతిభ కలిగిన యువత ఉన్నారని తెలిపారు. వారికి సరైన అవకాశాలు కల్పిస్తే, వారు జాతీయ అభివృద్ధికి దోహదపడతారన్నారు. రాష్ట్ర యువతకు ప్రాముఖ్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.

# ముహూర్తం ఫిక్స్

- 30న బీజేపీలోకి యువ నాయకుడు ధరావత్ నరేష్ నాయక్
- రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలో చేరిక
- డోర్నకల్ బీజేపీకి మరింత బలం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు నవ నాయకుడు ముందుకు వస్తున్నాడు. డోర్నకల్ మండలం చాంప్ల తండా గ్రామపంచాయతీ శివారు ధరావత్ తండాకు చెందిన ధరావత్ నరేష్ నాయక్ ఈనెల 30వ తేదీన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్ర రావు సమక్ష్యంలో ఆ పార్టీలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేశారు. వృత్తిరీత్యా హనుమకొండలో స్థిరపడిన నరేష్ నాయక్ దేశ సంరక్షణ, హిందుత్వవాదం బలోపేతానికి మోడీ చేస్తున్న సంస్కరణలకు ఆకర్షితులై ఆ పార్టీలో చేరాలని నిర్ణయించారు. ఇప్పటికే నియోజవర్గ వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి ప్రజల మన్ననలను పొందారు. యువత తనకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నరేష్ నాయక్ పార్టీలో చేరడంతో బీజేపీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా మండల కేంద్రాల నుంచి భారీ ర్యాలీ నిర్వహించి జిల్లా కేంద్రంలో కషాయం కండువా కప్పుకొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. నియోజవర్గంలోని ఆయా మండలాధ్యక్షులు, వివిధ మోర్చా నాయకులతో సంప్రదించి వారి ఆధ్వర్యంలో బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నానని నరేష్ నాయక్ 'వరంగల్ వాయిస్' కు వివరించారు.



# లబ్ధిదారుల ఖాతాలో రూ.లక్ష


## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామ్ దేవ్

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వడివడిగా సాగుతున్నాయి. పనులు ప్రారంభించిన వారి ఖాతాల్లో మొదటి విడత డబ్బులు రూ.లక్ష జమ అవుతోంది. నగరంలోని 40వ డివిజన్ కు చెందిన కొండమీది సంధ్య–సంపత్ లకు సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసి రామ్‌దేవ్ చేతుల మీదుగా ఓచర్ ను అందజేశారు. మొదటి విడత నిధులు అకౌంట్ లో జమ కావడంతో లబ్దిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా దాసి రామ్ దేవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఉచిత కరెంట్, గ్యాస్, సన్నబియ్యం పంపిణీతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆదరణ పొందుతోందన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు బలంగా నమ్ముతున్నారన్నారు. కొండా దంపతుల నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు.

# గ్రీవెన్స్ వినతులకు అత్యంత ప్రాధాన్యం

**వరంగల్ వాయిస్, హనుమకొండ/వరంగల్ :** గ్రీవెన్స్ లో ప్రజలనుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, గ్రేటర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా అధికారులు, పలువురు తహసీల్దార్లతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తూ ప్రజలు 283 వినతులను అందజేశారు.

బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విభాగానికి 30, హెల్త్, సానిటేషన్ తొమ్మిది, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) పది, టౌన్ ప్లానింగ్ 49, మంచినీటి సరఫరా ఐదు, హార్టికల్చర్ రెండు, విద్యుత్ ఐదు మొత్తం 109 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com